నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ప్రకాశం బాపట్ల
మంగళవారం 4 మార్చి 2025 పేజీలు 8



# 8న జిల్లాకు సీఎం చంద్రబాబు రాక

## వెలిగొండ పనుల పురోగతిపై పరిశీలన

సూర్యప్రతినిధి, ఒంగోలు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన దాదాపు ఖరారైంది. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురంలో నిర్వహించనున్న వేడుకల్లో ఆయన పాల్గొననున్నారు. సభ ముగింపు అనంతరం వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు వెళ్లనున్నారు. అలాగే ప్రాజెక్టు పనుల పురోగతికి సంబంధించి అధికారులతో చర్చించనున్నారు. అనంతరం స్థానిక నేతలతో భేటీ కానున్నారు.

# వేసవిలోనూ రైతులకు నిరంతరాయ విద్యుత్తు

గృహ, పారిశ్రామిక, వ్యాపారులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక విద్యుదుత్పత్తిపై దృష్టి

ఆర్డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయాలి

డిస్కంల సిఎండిలతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష

సూర్యప్రతినిధి, ఒంగోలు



వేసవికాలంలో అధిక వినియోగానికి తగినట్లు విద్యుత్ ఉత్పత్తి ఉండేలా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. వేసవిలో విద్యుత్ వినియోగం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై డిస్కంల సీఎండీలతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సచివాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న వేసవికాలంలో కూడా రైతులకు 9 గంటల నిరంతరాయ ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. గృహ, వ్యాపార, పారిశ్రామిక వినియోగ అవసరాలకు ఇబ్బంది లేకుండా అందరికీ 24 గంటల విద్యుత్ అందించాలని స్పష్టం చేశారు. విద్యుత్ గరిష్ట డిమాండ్ సుమారు 13,700 మెగావాట్లకు చేరుకోవచ్చని, ఈ వేసవి కాలంలో రోజువారీ విద్యుత్ వినియోగం 260 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని అంచనాలున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలతో విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యుత్ సంస్థలకు సూచించారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగ డిమాండ్‌ను తీర్చడానికి ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని, ముఖ్యంగా సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం 22,709 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చిందన్నారు. డిమాండ్ మేరకు రైతులకు అవసరమైనన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. వేసవికాలంలో ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం చేకూర్చేలా కనెక్షన్ల ప్రాసెసింగ్ వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి విద్యుత్ పంపిణీ సామర్థ్యాలను పెంచుకోవడం, నష్టాలను తగ్గించడం, సబ్ స్టేషన్లు, ట్రాన్స్ మిషన్ నెట్వర్కులను ఆధునీకరించడంపై అధికారులు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. సమీక్షలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిస్కంల సిఎండిలు పృథ్వీ తేజ్, భాస్కర్, సంతోష్‌రావు, నెడ్ క్యాప్ వీసీఎండీ ఎం.కమలాకర్‌బాబు, ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శి కుమార్‌రెడ్డి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ, ఉచిత విద్యుత్‌కు రూ.12,400 కోట్ల వ్యయం



పగటి పూటే రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా

కూటమి ఏర్పడిన అనతి కాలంలోనే రైతులకు 22,709 కనెక్షన్లు

ఇప్పటి వరకు 69,975 వ్యవసాయ కనెక్షన్లు మంజూరు

పిఎం కుసుమ్ కింద ఇప్పటికే లక్ష కనెక్షన్లు అందజేశాం

కేంద్రం సహకారంతో త్వరలో 2 లక్షలు అందజేసేలా చర్యలు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

సూర్యప్రతినిధి, ఒంగోలు

రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్న సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా అన్నదాతలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్యవసాయ ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శాసనసభలో విద్యుత్ శాఖకు సంబంధించి సభ్యులు బత్తుల బలరామకృష్ణ, ఉగ్రనరసింహారెడ్డి, బండారు సత్యానందరావులు అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి సోమవారం సభలో సమాధానమిచ్చారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు, ఉచిత విద్యుత్‌కు ఏడాదికి రూ.12,400 కోట్లకు పైగా వ్యయం చేస్తుందని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే 22,709 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, మొత్తం 69,975 కనెక్షన్లను మంజూరు చేశామని స్పష్టం చేశారు. ఒక్కో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం కూటమి ప్రభుత్వం రూ.2.60 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. డిస్కంల్లో విద్యుత్ ఉపకరణాల ధరలు తేడా ఉండడంపై సభ్యులు మాట్లాడిన విషయంపై స్పందించిన ఆయన వైకాపా ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిందన్నారు. స్థంబాలు, ట్రాన్స్‌మిషన్ లైన్లను అత్యధిక ధరలకు కొనుగోలు చేయడంతో మూడు డిస్కంల పరిధిలోని ధరల్లో వ్యత్యాసం ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత

మిగతా 8లో



# పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

## పరిశీలించిన ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉండేలా నిత్యం పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులకు సూచించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఒంగోలులోని సెయింట్ జేవియర్స్ స్కూల్ పరీక్షా కేంద్రాన్ని స్వయంగా తనిఖీ చేశారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రంలో మొబైల్ ఫోన్‌లను అనుమతించరాదని, పరీక్షా కేంద్రాల దగ్గరలో జిరాక్స్, ప్రింటింగ్ సెంటర్లు మూయించాలని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో బయట వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు తిరగకుండా చూడాలని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించడానికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన కనీస వసతులు సమకూర్చాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 67 ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా సమయంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలు తిరుగుతూ ఉంటాయని, ప్రశ్నపత్రాల తరలింపు, సమాధాన పత్రాలు డిపాజిట్‌కు ఎస్కార్ట్‌ను ఏర్పాటు జరిగిందని చెప్పారు. ఎస్పీ వెంట ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, ఒంగోలు తాలూకా ఎస్సై సందీప్, సిబ్బంది ఉన్నారు.

# నిర్ణీత గడువులో సర్వేలు పూర్తి చేయాలి

ఎంఎస్ఎంఈ సర్వే, పి-4 సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : జిల్లాలో జరుగుతున్న ఎంఎస్ఎంఈ సర్వే, పి-4 సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, మున్సిపల్ కమిషనర్లను, ఎంపిడిఓలను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలసి, గృహ నిర్మాణాల పురోగతి, ఎంఎస్ఎంఈ సర్వే, పి-4 సర్వే, మిస్సింగ్ సిటిజన్స్ మ్యాపింగ్, సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్

మిగతా 8లో

## మహిళల ఉపాధి కల్పనకు భరోసా ఎంపీడీవో సత్యనారాయణ



పిట్టలవానిపాలెం, మేజర్‌న్యూస్: ఈ నెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని బిసి, ఇబిసి, ఇడబ్ల్యూఎస్, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులముల 18 నుండి 45 సంవత్సరముల లోపు దిగువ తరగతి మహిళలకు ఉపాధి కల్పనకు భరోసా కల్పిస్తూ 90 రోజుల కుట్టు శిక్షణా తరగతులు నిర్వహించి అనంతరం కుట్టు మిషన్ ఇచ్చుటకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పంచాయితీ కార్యదర్శి మండలంలోని గ్రామాల సర్పంచులకు, ఎంపీటీసీలకు, మహిళలకు తెలియపరచి సానుకూలంగా ఉన్న మహిళల వివరాలు గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద యాప్ నందు పొందుపరచాలని తెలియజేశారు పిట్టలవానిపాలెం ఎంపీడీవో ఐ సత్యనారాయణ.

## భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలి



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు బండారు శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 మాసాలు అయినప్పటికీ ఇంతవరకు సంక్షేమ బోర్డు ప్రకటించకపోవడం బాధాకరమన్నారు.సంక్షేమ బోర్డును ప్రారంభించి పెండింగ్ లో ఉన్న 42 వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలని,50 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ 6000 ల పెన్షన్ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంకోసం ఈ నెల 28న డిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుం దని శ్రీనివాసరావు తెలిపారు.ఈసమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఒబులుశెట్టి రమేష్, విష్ణుమొలకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను ఆప్కాస్‌లో కొనసాగించాలి




కనిగిరి, మేజర్‌న్యూస్: మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కనిగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసెఫ్‌కు అందజేశారు. సిఐటియు జిల్లా నాయకులు పిసి కేశవ రావు మాట్లాడుతూ మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులను ఆప్కాస్‌లో కొనసాగించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేయాలని, కరోనా కార్మికులను ఆప్కాస్ లో పేర్లు నమోదు చేయాలని కోరారు. కార్మికురాలు అచ్చమ్మ పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని, మునిసిపల్ కార్మికులకు సంక్రాంతి కానుక అమలు చేయాలని కోరారు. చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యుల పేర్లు ఆప్కాస్‌లో చేర్చి ఉపాధి కల్పించి, నామినీల అకౌంట్‌లో పిఎఫ్ అమౌంట్ వేయాలని డిమాండ్ చేశారు. కార్మికుడు జక్కరయ్య పేరును కరోనా కార్మికునిగానే కొనసాగించాలని, మునిసిపల్ కార్మికులను సచివాలయాలకు అప్పగించవద్దని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు దిగడం, ఆందోళన ఉధృతం చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్ ప్రసాదు, ఓబయ్య, జాన్సన్, దానియేలు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా పోలీస్ ఉద్యోగులకు హెల్మెట్ వితరణ



బాపట్ల, మేజర్‌న్యూస్: కొద్దిపాటి నిర్లక్షమే రోడ్డు ప్రమాదాలలో తీరని లోటు మిగిలుస్తుందని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ ప్రజలను హెచ్చరించారు. మహిళా సాధికారత వారోత్సవాలలో భాగంగా డా.శిఖేంద్రనాథ్ ఫౌండేషన్ నిర్వాహకుల సహకారంతో జిల్లా పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు ద్విచక్ర వాహనాల పై వచ్చే మహిళా సిబ్బందికి స్థానిక కార్యాలయంలో సోమవారం అడిషనల్ ఎస్పీ హెల్మెట్ లను అందించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఎమ్.బీ.బీ.యస్ చదివి ఎమ్.డి పీజీ కోర్సుకు శిక్షణ తీసుకుంటూ రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ లేని కారణంగా మృత్యువాత పడిన ఘటనను తలచుకుంటే ఎంతో ఆవేదనగా ఉందన్నారు. రోడ్డు ప్రమాదం కారణంగా తమ కుటుంబంలో జరిగిన ఘోర ఘటన వేరొకరికి జరగకూడదు అనే ఉద్దేశంతో చంద్ర ప్రసాద్ - చంద్ర మాధవీ లత లు తమ కుమారుడి పేరున డా.శిఖేంద్రనాథ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మార్చి 1వ తేది నుండి జిల్లాలో మహిళ సాధికారిక వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సమాజహితం కొరకు ముందుకు వచ్చి సమాజ సేవ చేసే వారికి పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటూ తోడ్పాటు అందిస్తుందని అడిషనల్ ఎస్పీ తెలిపారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఫౌండేషన్ స్థాపకులు చంద్ర ప్రసాద్ - చంద్ర మాధవీ లత, డైరెక్టర్లు జితేంద్ర, భార్గవ, కొర్రపాటి చక్రధర్ ఇషాంత్, ప్రముఖ దినపత్రిక చీఫ్ ఎడిటర్ బాలినేడి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద శబ్దాల నుండి మీ వినికిడిని రక్షించుకోండి: డిఎంహెచ్ఓ



బాపట్ల మేజర్ న్యూస్: ప్రపంచ వినికిడి దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ విజయమ్మ మాట్లాడుతూ వినికిడి లోపం యొక్క లక్షణాలను తీవ్రంగా పరిగణించండి. సంభాషణలు వినడంలో ఇబ్బంది లేదా మీ చెవుల్లో మోగడం వంటి ఏవైనా మార్పులను మీరు గమనించినట్లయితే, వెంటనే ఇఎన్టి వైద్యుడిని లేదా ఆడియాలజిస్టను సంప్రదించండి. పెద్ద శబ్దాల నుండి మీ వినికిడిని రక్షించుకోండి. సాధ్యమైనప్పుడల్లా పెద్ద శబ్దాలను నివారించండి. మీరు పెద్ద శబ్దాల చుట్టూ ఉంటే వినికిడి రక్షణను ధరించండి. మీ శరీరం చెప్పేది వినండి. మీ చెవులు అలసిపోయినట్లు లేదా నొప్పిగా అనిపించడం ప్రారంభిస్తే, విరామం తీసుకొని వాటికి విశ్రాంతి ఇవ్వండి. ఈ చిట్కాలను పాటించడం వలన మీ వినికిడిని కాపాడుకోవచ్చు, వినికిడి లోపాన్ని నివారించవచ్చు అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

# ప్రారంభమైన ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు



రేపల్లే, మేజర్‌న్యూస్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నాడు ప్రశాంతంగా ప్రారంభమైనాయి. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు రేపల్లె పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమైనవి. పరీక్షకు అర్ధగంట ముందే విద్యార్థులు కళాశాలకు వచ్చి తమ హాల్ టికెట్లు చూసుకుని కేటాయించిన రూములకు అరగంట ముందే పరీక్షా కేంద్రాల్లో చేరుకున్నారు. ఈ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ను విధిస్తూ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పా టు చేశారు. పరీక్షా కేంద్రాలకు దగ్గర్లో ఎవరిని అనుమతించకుండా బందోబస్తు ఏర్పాట్లు డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ మల్లికార్జున రావు పర్యవేక్షణలో ఎస్సై రాజశేఖర్ ఇతర పోలీసు మహిళా పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవ త్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభ మయ్యాయి. పరీక్ష కేంద్రానికి లోపలికి వెళ్లే విద్యార్థినీ విద్యార్థులను మెయిన్ గేటు వద్ద పోలీసులు చెకింగ్ చేసి పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగానే పంపుతున్నారు. విద్యార్థినీ విద్యార్థులతో కోలాహలంగా పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. విద్యార్థులు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలపై పరీక్షా కేంద్రానికి తీసుకు వచ్చారు. ఈనెల 15వ తేదీ వరకు ప్రథమ ద్వితీయ ఇంటర్ పరీక్షలు జరుగుతాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారి తెలిపారు.

# బాల్య వివాహాలు నిర్మూలనకై సంతకాల సేకరణ



మార్కాపురంరూరల్, మేజర్‌న్యూస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు మార్కాపురం ఐసీడీస్ ప్రాజెక్ట్ నందు 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా బాల్య వివాహలను నిర్మూలించటంలో భాగంగా సంతకాల సేకరణలో భాగంగా సబ్ కలెక్టర్ చేత మొదటి సంతకం చేయించుట జరిగింది. ఆడ బిడ్డ పేరు మీద మొక్క నాటటం, కాండిల్ ర్యాలీ, పుట్టినరోజు వేడుకలు నిర్వహించటం జరిగినది. ఈ కార్యక్రమంలో సీడీపీఓ బి.సుశీలదేవి, సూపర్‌వైజర్స్ ఎం.బుజ్జి, కె.రవి కుమారి, కె.రమ అంగన్వాడీ కార్యకర్తలు, మత పెద్దలు పాల్గొన్నారు.

# జూద క్రీడలంటూ నిరాధార ఆరోపణలు తగదు



రేపల్లే, మేజర్‌న్యూస్: జన సైనికులు జూద క్రీడలు నిర్వహిస్తున్నారంటూ నిరాధార ఆరోపణలు చెయ్యటం తగదని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాక్షి పత్రిక కథనంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో జనసైనికులు విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నియోజకవర్గం జూద క్రీడలకు అడ్డగా మారిందన్నారు. ఆనాడు నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై జూద క్రీడలపై గళమెత్తింది జన సైనికులే అని గుర్తుచేశారు. సమగ్రమైన విచారణ చేసి, ఆధారాలతో వార్త కథనాలు ప్రచురించాలి తప్పా.. కక్షపూరితంగా వ్యవహరిస్తూ కూటమి పార్టీల మధ్య విభేదాలు సృష్టించేలా వ్యవహారించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మలిశెట్టి సాయి, సురేష్, కొలసాని అనిల్, కొక్కిలిగడ్డ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు వ్యాసరచన పోటీలు



వేమూరు(భట్టిప్రోలు)మేజర్‌న్యూస్: జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ చట్టాలు, వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## యేసమ్మ కుటుంబానికి సాయం



కర్లపాలెం, మేజర్‌న్యూస్: పేరలి గ్రామం మల్లెలవారిపాలెంకి చెందిన కాగిత ఏసుమ్మ మరణించారు. పేరలి నరసయ్య, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ డా. పేరలి బాలకృష్ణ మూర్తి సహకారంతో కర్లపాలెం మండల టీడీపి పార్టీ అధ్యక్షులు ఏపూరి భూపతి రావు ,గేరా ఏసుబాబు చేతుల మీదుగా మట్టి ఖర్చుల నిమిత్తం 5000 వేలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాగిత విజయ రాజు, మద్దిబోయిన బుల్లియ్య, మద్దిబొయిన చిట్టిబాబు, దాసరి రత్నరాజు, మేకల విక్టోరియ్య,షేక్ జానిభాషా, జోగి రాజేష్, కాగిత ఏసుబాబు,సుభాని,జోగి ఇశ్రాయేలు, ఈవూరి రమేష్, ఏపూరి బురకాయ, మల్లెల సత్యం, మల్లెల పీటర్ పాల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన ఆవిష్కరణ దిశగా ప్రతి విద్యార్థి ఆలోచించాలి



మార్కాపురం, మేజర్‌న్యూస్: ప్రతి విద్యార్థి నూతన వస్తువును తయారు చేసేలా, నూతన ఆవిష్కరణలు సృష్టించే దిశగా ఆలోచించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఏనుగుల రవికుమార్ పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ డే వారోత్సవాలను సోమవారం మార్కాపురంలోని వాసవి విద్యానికేతన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ సైన్సు పట్ల ఆసక్తి కనబరుస్తూ విద్యార్థులు భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తయారుకావాలన్నారు. అనంతరం చెకుముకి సంబరాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ఆ పాఠశాల కరస్పాండెంట్ కందేరపు రంగయ్య చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల సైన్సు ఉపాధ్యాయురాలు అపర్ణ, జన విజ్ఞాన వేదిక యూత్ నాయకులు ఏనుగుల శివ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ విమర్శలే చేయండి: వ్యక్తిగత విమర్శలొద్దు



పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ని విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదని పుల్లలచెరువు జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రెటరీ జానకి రఘు, మండల వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ఎంపీటీసీ రాములు, సీనియర్ నాయకుడు ఉమా మహేశ్వరరెడ్డి, చాపలమడుగు సర్పంచ్ తమ్మినేని సత్యనారాయణ రెడ్డి, నాయుడుపాలెం సర్పంచ్ కోటిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జానకి రఘు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రజల పక్షాన యర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ నిలబడి ప్రజలకు ఏమి చేసారో చెప్పాలని కూటమి ప్రభుత్వ నాయకులను ప్రశ్నించి అడుగుతుంటే ఎమ్మెల్యేను విమర్శిస్తారా..? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తాటిపర్తి కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తి చూపుతుంటే దాన్ని ఓర్వలేక ఎమ్మెల్యేపై లేనిపోని మాటలు స్థాయికి మించి టీడీపీ నాయకులు మాట్లాడుతున్నారని మాకు నోర్లు ఉన్నాయని మేము మాట్లడగలమని అన్నారు. టీడీపి నాయకులు ముఠాగా ఏర్పడి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఎన్ని శక్తులు ఒక్కటైన ప్రశ్నించే తాటిపర్తి గొంతుని అడ్డుకోలేరన్నారు. అధికార నేతల ముఠా కాదు.. అదొక దోపిడీ ముఠా అని ఎద్దేవా చేశారు. ప్రజల బియ్యం అమ్ముకుంటూ అలాగే లిక్కర్ బాటిల్‌పై 20 రూపాయలు ఎక్కువ అమ్ముకుంటూ జేబు నిపుకుంటున్నది అందరికీ తెలిసిన విషయమే మీ దోపిడీనీ ప్రజల చేత ఎన్నోకోబడిన ఎంఎల్ఏ కాబట్టి అక్రమాలను బయట పెట్టి మాట్లాడుతున్నాడు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని అడుగుతుంటే ఒక ఎంఎల్ఏనీ నోటికి వచ్చినట్లు స్థాయికి మించి మాట్లాడటం సరికాదు. రాష్ట్రంలో ముందుగా చంద్రబాబు అయిన పవన్ కళ్యాణ్ అయిన చంద్రశేఖర్ అయిన ప్రజల చేత ఎన్నుకోబడిన ఎంఎల్ఏలు తరువాతే మంత్రులు, ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి అయిన యర్రగొండపాలెం నియోజకవర్గం చంద్రశేఖర్‌ది ఎందుకంటే ఇక్కడ ప్రజలచేత ఎన్నుకోబడిన వ్యక్తి ఎంఎల్ఏ చంద్రశేఖర్ ఇక్కడ ప్రొటోకాల్ అయిన, అధికారం అయిన గెలిచిన వ్యక్తికి తప్ప ఎవరికి బడితే వారికి ప్రొటోకాల్, అధికారం రాదని వైసిపి నాయకులు అన్నారు. ప్రజలు మీకు అధికారం ఇచ్చారు ప్రజలకు మీరు మంచి పరిపాలన అందించాలని కోరారు. ఈ సమావేశంలో రమణ రెడ్డి, మల్లపాలెం సర్పంచి రమణ రెడ్డి, బసివి రెడ్డి,మాజీ డీలర్ మస్తాన్ రెడ్డి, ఈసు, ఎస్సి నాయకులు ఆరేవుల ఇస్సాకు, యర్ర గురవయ్య, ఎస్టీ నాయకుడు హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గాలికుంటు వ్యాధి పట్ల పసు పోషకులు అప్రమత్తంగా ఉండాలి

యర్రగొండపాలెం, మేజర్‌న్యూస్: గేదెలు, గొర్రెలు, మేకల యజమానులు గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని అమాను గుడిపాడు ప్రభుత్వ పశువైద్యాధికారి డాక్టర్ ఉడుముల శివారెడ్డి కోరారు.సోమవారం అమాను గుడిపాడు గ్రామంలో 210 గేదెలు,95 ఎద్దులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం మండల వ్యాప్తంగా ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తానన్నారు. గాలికుంటు వ్యాధి సూక్ష్మక్రిముల ద్వారా వస్తుందన్నారు.ఈ వ్యాధి సోకిన పశువులు 24 గంటల్లోగా చిక్కిపోయి అల్సర్ కు గురవుతాయని చెప్పారు.రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వర తీవ్రత ఎక్కువగా ఉ టుంద న్నారు. నోరు, పెదాలు, నాలుక, చన్నులతో పాటు కాళ్ల గిట్టల మధ్య పుండ్లు వచ్చి అనతి కాలంలోనే ఈ వ్యాధి వ్యాపిస్తుందని తెలిపారు.ఈ వ్యాధి సోకిన పశువులు ఎప్పుడు ముడుచుకుని పడుకుంటాయని వివరించారు. దీని కారణంగా పశువులు మేత,నీళ్లు సరిగా తీసుకోలేవు.నెమరు వేయలేవు, నోటి నుంచి పొంద లేక మురగ కారుతుండటంతో పాటు పశువులు బరువు తగ్గిపోతాయన్నారు. పశువుల్లో పునరుత్పత్తి తగ్గిపోయి, చూడి పశువులు ఈనుకుపోయే (అబార్షన్) అయ్యే అవకాశం ఉంటుంది.కాళ్ల మధ్యన పుండ్లు పడడం వల్ల సరిగ్గా నడవలేవు. పాల ఉత్పత్తి తగ్గిపోవడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి తగ్గి కొన్నిసార్లు చనిపోయే అవకాశం ఉందన్నారు. వ్యాధి సోకిన దూడలు 30 నుంచి 40శాతం చనిపోతుంటా యని చెప్పారు. ముందుస్తు నివారణలో భాగంగా టీకాలు వేయించుకోని వ్యాధి బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు ఆరోగ్య సహాయకులు మజీద్, వలి, నారాయణ, యల్లారెడ్డి,షేక్ బాజీ,షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చు



చీరాల, మేజర్‌న్యూస్: చీరాల భారతి సీడ్స్ ఉపయోగించి మొక్కజొన్న పంటలు అధిక దిగుబడులు సాధించవచ్చని భారతి సీడ్స్ రీజినల్ సేల్స్ మేనేజర్ బి.సుబ్బారావు అన్నారు. చీరాల మండలం గవినివారిపాలెంలో మొక్కజొన్న రైతులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతి సీడ్స్‌ను ఉపయోగించడం ద్వారా పంట దిగబడిలో సత్ఫలితాలు ఉంటాయని చెప్పారు. ముఖ్యంగా పురుగు సమస్య కూడా పంటకు ఏమాత్రం ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సేల్స్ ఆఫీసర్స్ ఎన్.శ్రీనివాస్,ఎం.జనార్దన్, ఏ.రమేష్, బీ.గోపి,లక్ష్మీబాబులు ఉన్నారు.

## ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు: శ్రీపతి సతీష్

టంగుటూరు, మేజర్‌న్యూస్ : కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేసినా కొణిజేడులో అక్రమ మైనింగ్ ఆగడం లేదని కాంగ్రెస్ పార్టీ కొండేపి ఇన్‌చార్జ్ శ్రీపతి సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొణిజేడులో అక్రమ మైనింగ్ చేసే అక్రమార్కులుకు లెక్క లేకుండా పోతుందన్నారు. ఏడు అడుగులు 8 అడుగులు గుంటలు తవ్వి లక్షలలో ఇనుప ఖనిజం ఉన్న గ్రావెల్ మట్టి మీ అమ్ముతున్నారని ఆధారాలతో సహా అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన రోజు పోలీస్ పికెటింగ్ హడావుడి చేస్తున్నారు. ఒక టిప్పర్ సీజ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. తర్వాత అవి యదా విధిగా తిరుగుతున్నాయి. అధికారులు చూసిచూడనట్టు వ్యవహరించడం వల్లే ఇంత విచ్చలవిడిగా మైనింగ్ జరుగుతుందని సతీష్ ఆరోపించారు. పూర్తి వివరాలతో వివరిస్తామని మైనింగ్ చేయడం వల్ల ఆరేడు అడుగుల లోతు గుంటలు చేస్తున్నారని తద్వారా నీరు చేరి పసిపిల్లలు పశువులు పడి చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇకనైనా కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని తెలిపారు.

## మహిళా సాధికారిక వారోత్సవాల్లో వ్యాసరచన పోటీలు

బాపట్ల మేజర్‌న్యూస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి సూచనలతో జిల్లా పోలీస్ శాఖ మార్చి 1వ తేదీ నుండి జిల్లాలో మహిళా సాధికారత వారోత్సవాలు ప్రారంభించారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సాధించిన ప్రగతిని గురించి, మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యలు గురించి అవగాహన కల్పించేందుకు, మహిళల శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయరక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మార్చి 3న సోమవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పాఠశాల, కళాశాలలోని విద్యార్థినిలకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మార్చి 08 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందించను న్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మహిళా చట్టాలు, ఫోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక మాధ్య మాలు వినియోగించు విధానం, సైబర్ నేరాలు జరుగుతున్న తీరు మొద లగు వాటి గురించి వివరించి వాటి నుండి అప్రమత్తంగా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు/చిన్నారులకు అత్యవసర సమయంలో సహాయం కొరకు హెల్ప్‌లైన్ నెంబర్లకు కాల్ చేసి పోలీసులు సహాయం పొందాలన్నారు. బాలబాలికలకు సంబంధించిన సమస్యలకు చైల్డ్ హెల్ప్ లైన్:1098, మహిళలకు సంబందించిన సమస్యలకు ఉమెన్ హెల్ప్ లైన్:181, పోలీస్ శాఖను సంప్రదించేందుకు పోలీస్ హెల్ప్ లైన్:112, సైబర్ నేరాలకు గురైతే సంప్రదించవలసిన సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్:1930 లను సంప్రదించాలని సూచించారు.

## స్త్రీ తోనే సమాజ మనుగడ: సిడిపిఓ

దర్శి మేజర్‌న్యూస్: స్త్రీ తోనే సమాజ మనుగడ అని బాలికల ను పుట్టానిద్దాం, ఎదగానిద్దాం, చదవనిద్దాం అని ఐ. సి. డి. ఎస్ సిడిపిఓ భారతి అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెండో రోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో కిషోర్ బాలికైన గౌరీ శరణ్యకు పుట్టినరోజు కార్యక్రమం నిర్వహించి సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఎస్సీ బాలికల హాస్టల్ నందు బాలిక పేరు మీద ఒక మామిడి మొక్కను నాటారు.ఈ కార్యక్రమానికి సిడిపిఓ సిహెచ్ భారతి, హెచ్ఎం ఖాదర్ మస్తాన్‌వలి సూపర్వైజర్స్ స్కూల్ టీచర్స్ స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం క్యాండిల్ ర్యాలీ నిర్వహించి బాలికలని పుట్టనిద్దాం ఎదగనిద్దాం చదవనిద్దాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు.

## సిపియం అధ్వర్యంలో ఆందోళన




దర్శి మేజర్ న్యూస్. సిపియం ఆధ్వర్యంలో గడియార స్థంభం సెంటర్ లో 10 సంవత్సరాల క్రితం ప్రకటించిన దొనకొంనిర్వహించారు. పారిశ్రామిక కేంద్రానికి మౌళిక సదుపాయాలు కల్పించడానికి రాష్ట్ర బడ్జెట్ లో నిధులు ప్రకటించాలని, ఆగిపోయిన జాతీయ డ్రైవింగ్ స్కూల్ కి నిధులు కేటాయించి పనులు పూర్తిచేయాలని,పట్టణానికి 2సంవత్సరాల క్రితం అమృత మంచినీటి పథకానికి వచ్చిన 121 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించి, ఇంటి,ఇంటికి మంచినీటి కుళాయి కలెక్షన్స్ ఇవ్వాలని ఆందోళన నిర్వహించారు.వెలుగొండ కి 2వేల కోట్లు కేటాయించి ప్రాజెక్టు పూర్తి చేసి , నీటిని విడుదల చేయాలని,నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు పూర్తి చేసి , దర్శి వరకు రైల్లు నడపాలని,వెనుక బడిన ప్రకాశం జిల్లాకి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## రెండు బైకులు ఢీ-ఇద్దరికీ గాయాలు

ముండ్లమూరు మేజర్ న్యూస్.మండలంలోని అద్దంకి దర్శి రోడ్డులో పోలవరం సమీపంలో రెండు బైకులు ఢీకొన్న సంఘటన సోమవారం జరిగింది. చింతలపూడి గ్రామానికి చెందిన దాసరి నాగేశ్వరరావు ఆయన భార్య నాగేశ్వరమ్మకి గాయాలయ్యాయి. అద్దంకి నుంచి ముండ్లమూరు వస్తున్న ద్విచక్ర వాహనం చింతలపూడి నుండి అద్దంకి వెళ్తున్న దాసరి నాగేశ్వరావు చక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో గాయాలైన ఇరువురిని 108 ఈఎంటి హరిబాబు, పైలెట్ శ్రీనివాసులు ప్రథమ చికిత్స చేసి అద్దంకి ఆసుపత్రికి తరలించారు. దాసరి నాగేశ్వరావు కు తీవ్ర గాయాలు కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు రిమ్స్ కు తరలించారు.

## కూలీల ఆటో బోల్తా-ఇరువురికి గాయాలు

ముండ్లమూరు మేజర్‌న్యూస్: మండలంలోని సింగన్నపాలెం రోడ్డులో ముండ్లమూరు గ్రామంలోని బ్రహ్మంగారి చెట్టు వద్ద కూలీల ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో లక్కవరం గ్రామానికి చెందిన అంజయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరొక మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. లక్కవరం గ్రామం నుండి ఉమామహేశ్వరపురం మిరపకాయల కోతకు వెళుతున్న ఆటో బ్రహ్మంగారి చెట్టు వద్ద ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ సంఘటనలో తీవ్రగాయాలైన అంజయ్యను 108 సిబ్బంది ఈఎంటి జి సునీత, పై లెట్ కె. అజయ్‌లు ప్రథమ చికిత్స చేసి అద్దంకి ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలైన అంజయ్యను మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

## మానవత్వం చాటుకున్న ఎస్.ఐ

### క్షతగాత్రులను పోలీస్ జీప్‌లో హాస్పిటల్‌కు పంపిన ఎస్.ఐ



ముండ్లమూరు మేజర్ న్యూస్. మండలంలోని పోలవరం సమీపంలో ఎదురు, ఎదురుగా వచ్చిన రెండు బైక్ లు డికోన్నాయి. ఈ సంఘటనలో ఇరువురుకి గాయలు అయ్యాయి. విషయం తెలిసిన ఎస్.ఐ వై. నాగరాజు సంఘటన స్థలానికి వెళ్లారు. వెంటనే ఎస్.ఐ క్షత గాత్రులును ఎస్.ఐ నాగరాజు తన జీప్‌లో హాస్పిటల్‌కు తరలించారు. ఎస్.ఐ సేవ నిరతి ని పలువురు ప్రజలు కొనియాడారు.

## నిబద్ధతతో పనిచేసే క్షేవ్యాధిని తరిమికొట్టాలి

బాపట్ల మేజర్ న్యూస్: ఈ నెల 24 న అంతర్జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకొని బాపట్ల పట్టణం రామకృష్ణాపురంలోని పేర్లి సునీల్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ లో జిల్లా స్తాయి సదస్సు నిర్వహించారు. డీఎల్ఎటిబి ఆఫీసర్ డా. సాధిక్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించినచో పూర్తిగా నిర్మూలించ వచ్చు అని పేర్కొన్నారు. హెచ్ ఈ ఓ కృష్ణ రెడ్డి మాట్లాడుతూ రెండు వారలకు మించి దగ్గు, జ్వరం ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించాలని సూచించారు. కళాశాల చైర్మన్ పేర్లి సునీల్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థినులు నిబద్ధతతో పనిచేసి క్షయ వ్యాధిని తరిమి కొట్టవలెను అని పేర్కొన్నారు. తదుపరి నర్సింగ్ విద్యార్థినులుకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్రహం, మల్లికార్జునరావు, నరేంద్రబాబు, ప్రపుల్ల, దీప్తి, కార్తీక్,ధనుంజయరావు,మేరి, కళాశాల సిబంది రత్నాకర్,ఆశా,సుష్మా,వాసంతి,అంజమ్మ, పేర్లి సునీల్ కుమార్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ బిఎస్సి, సుశీల స్కూల్ ఆఫ్ నర్సింగ్ జిఎన్ఎం విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఉగ్రతో కలసి సమస్యలపై మంత్రికి వినతి

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో మండల టిడిపి అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య,సర్పంచ్ శ్రీరాం పద్మావతి, నాయకులు కలిశారు. సోమవారం సచివాలయంలోని మంత్రి ఛాంబర్ నందు కలిసి మండలంలో నెలకొన్న పలుగ్రామాల రెవెన్యూసమస్యలను నాయకులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా మండల కేంద్రమైన సి.ఎస్.పురం పట్టణంలో ప్రభుత్వ, పంచాయతీ, పశువుల బీడుభూములు, స్థలాలు ఉన్నట్లు పట్టణంలో పేదకుటుంబాలకు స్వంత ఇంటిస్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని అర్హులైన పేదకుటుంబాలకు ప్రభుత్వం ఇంటిస్థలాలు మంజూరు చేసి ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇళ్ళు నిర్మించుకునేందుకు అనుమతులు మంజూరు చేసి తగిన చర్యలు తీసుకోవాలని మండలంలో నిర్మాణంలో ఉన్న బెంగుళూరు కడప విజయవాడ(బికెవి)గ్రీన్ ఫీల్డ్ జాతీయరహదారి నిర్మాణంలో కొందరు రైతులకు నష్టపరిహారం అందలేదని సంబంధిత అధికారులు పరిశీలించి రైతులకు న్యాయం జరిగేలా నష్టపరిహారం త్వరితగతిన అందేలా చూడాలని మైదుకూరు సింగరాయకొండ జాతీయ రహదారి నిర్మాణంలో మండలంలో పలుగ్రామాలలో పలువురు ఇళ్ళు కోల్పోయినట్లు ప్రభుత్వం



నష్టపరిహారం ఇవ్వలేదని మంజూరు చేయించాలని మంత్రిని నాయకులు కోరారు. అదేవిధంగా మండలంలో అక్రమాలకు గురైన ప్రభుత్వ పంచాయతీ రెవెన్యూ భూములను కాపాడాలని మండలంలోని పలుగ్రామాలలో రైతులు రెవెన్యూ భూసమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించేలా చూడాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాద పూర్వకంగా నాయకులు కలిశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యప్రసాద్‌ను కలిసినవారిలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి వెంట మండల టిడిపి అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, సర్పంచ్ శ్రీరాంపద్మావతి, మండల టీడీపీ సీనియర్ నాయకులు పునుగుపాటి రవికుమార్, ఏ.రామకృష్ణంరాజు, బొబ్బూరి రమేష్, జె.లక్ష్మీదేవి, బత్తుల వెంకటాద్రి తదితరులు ఉన్నారు.

# రథోత్సవంకు అల్పాహారం ఏర్పాటు

మార్కాపురం, మేజర్‌న్యూస్: జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి వారి రథోత్సవం సందర్భంగా (శివాలయం) మార్కాపురంలోని దోర్నాల సెంటర్ దగ్గర రెడ్డి సంఘం కార్యాలయం నందు మార్కాపురం రెడ్డి సంక్షేమ సేవా సంఘం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆర్య వర్త డెవలపర్స్ (ఆర్యావర్త డెవలపర్స్ )గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ 162 ఫ్లాట్స్ మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్ వారి సహకారంతోటి అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగింది. ఎండాకాలంలో మార్కాపురం పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలందరికీ దాహార్తి తీర్చేందుకు మినరల్ వాటర్ తోటి ఒక చలివేంద్రం ఏర్పాటు చేయబోతున్నామన్నారు. సోమవారం కార్యక్రమంకు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తండ్రి కందుల నారాయణరెడ్డి, శివాలయం ఈవో చెన్నకేశవరెడ్డి, మాలపాటి వెంకట్ రెడ్డి రెడ్డి సంఘం టౌన్ అధ్యక్షులు తిరుమ



లరెడ్డి రామ్ రెడ్డి మండల అధ్యక్షుడు కుందూరు రమణారెడ్డి కర్ణ వెంకట నరసింహారెడ్డి, బట్టగిరి శివారెడ్డి, వెన్న వెంకటరెడ్డి, గోరంట్ల చిన్న వెంకటరెడ్డి ఆర్ వి సుబ్బారెడ్డి, దొండేటి వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టి రెడ్డి నరసింహారెడ్డి, ఏ.హనుమారెడ్డి, బత్తుల వెంకటరెడ్డి, చదలవాడ రామ్ రెడ్డి, కందుల లక్ష్మిరెడ్డి, కుందూరు సుబ్బారెడ్డి, గోగిరెడ్డి వెంకట్ నారాయణ రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు రెడ్డి సోదరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు అవగాహన కార్యక్రమం

బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లా ప్రొహిబిష, ఎక్సైజ్ అధికారి జి దేవ దత్తో, ఎక్సైజ్ సూపరింటెంట్ బి వెంకటేశ్వర్లు, సీఐ పీ. గీతిక స్టువర్టుపురం గ్రామంలో సారా రహిత ఆంధ్ర ప్రదేశ్ దిశగా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం, మాదకద్రవ్యాల వాడకం, అక్రమ మద్యం తయారీ, రవాణా, అమ్మకం, వినియోగంపై తీసుకునే క్రిమినల్ చర్యల గురించి వారికి



వివరించి, తమ ప్రాంతంలో అక్రమ మద్యం తయారీ నిర్మూలనలో భాగస్వాములు కావాలని కోరారు.

# ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బ్యాంకర్ల ధర్నా

ఒంగోలు, మేజర్‌న్యూస్: దేశంలో 9 బ్యాంకు ఉద్యోగుల సంఘాలు ఈ నెల 24, 25వ తేదీల్లో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యు.ఎఫ్.బి.యు.) తరపున బ్యాంకుల సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సమ్మె సందర్భంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ధర్నా కార్యక్రమాలలో భాగంగా సోమవారం ఢిల్లీలో పార్లమెంట్ (జంతర్ మంతర్) వద్ద బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులతో పాటు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. తమ యొక్క డిమాండ్లలో ముఖ్యంగా బ్యాంకులోని అన్ని విభాగాలలో తగిన రిక్రూట్మెంట్, వారానికి 5 రోజుల పనిదినాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్ మెన్, ఆఫీసర్ డైరక్టర్ల పోస్టుల భర్తీకి కూడా యు.ఎఫ్.బి.యు. డిమాండ్ చేస్తోంది. ప్రధానంగా పార్లమెంట్ (జంతర్ మంతర్ ) వద్ద జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్.సి.బి.ఇ) ప్రధాన కార్యదర్శి కా.ఎల్. చంద్రశేఖర్, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎ.ఐ.బి.ఇ.ఎ) ప్రధాన కార్యదర్శి కా.సి.హెచ్. వెంకటాచలం, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఎ.ఐ.బి.ఒ.సి)




ప్రధాన కార్యదర్శి కా.రూపమ్ రాయ్, మిగిలిన బ్యాంక్ ఉద్యోగుల సంఘాల ప్రధాన కార్యదర్శులు, ఇతర నాయకులు పాల్గొని పెద్దఎత్తున తమ నిరసనను తెలియపర్చారు. యు.ఎఫ్.బి.యు. తల పెట్టిన తదుపరి నిరసన కార్యక్రమంలో ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయవలసినదిగా నాయకులు కోరారు. తదుపరి కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ ఉద్యోగుల సంఘాల ప్రధాన కార్యదర్శులు యు.ఎఫ్.బి.యు తరపున డిమాండ్‌లతో కూడిన మెమోరాండమ్‌ను సెక్రటరీ, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకు అందజేశారు.

# పేదవాడికి సొంతింటి కల సాకారం

రేపల్లే, మేజర్‌న్యూస్: అర్హత కలిగిన ప్రతి పేదవాడికి సొంతింటి కల సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శాసనమండలి సమావేశాల్లో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీపై వైసీపీ ఎమ్మెల్సీలు రాజశేఖర్, హనుమంతురావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. అందరికీ ఇళ్ల పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలను ప్రతి పేదవానికి ఇవ్వాలనే ఆశయంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ఇప్పటి వరకు ఇళ్ల పట్టాల కోసం 70, 232 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన సెంటు స్థలాలలో కూడా తీవ్ర అవినీతికి, అక్రమాలకు పాల్పడిందని అన్నారు. జగనన్న కాలనీల పేరుతో అనేక అవకతవకలకు పాల్ప డ్డారని చెప్పారు. లబ్దిదారుల ఎంపికలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారుని ఆరోపించారు. ధనవంతులు, ఉద్యోగులు, పార్టీ కార్యకర్తలు, అను యాయులకు ఇళ్ల పట్టాలు పంచి పెట్టారని ధ్వజమెత్తారు. ఇళ్ల పట్టాల కోసం



భూముల కొనుగోలు లోనూ పెద్ద ఎత్తున దోపిడీ చేశా రని గుర్తుచేశారు. నివాస యోగ్యం కాని భూములను, శశ్మానాలు, డంపింగ్ యా ర్డులు పక్కనున్న భూములను, వర్షం వస్తే మునిగిపోయే భూములను రెండింతలు, మూడింతలు అధిక ధరలకు ప్రభుత్వంతో కొనిపించి ప్రజాధనాన్ని లూటీ చేశారని అన్నారు. మొత్తం 10,500 కోట్ల రూపాయలతో 26 వేల ఎకరాల ప్రయివేట్ భూములను కొనుగోలు చేశారు ఇందులో నుండి వేల కోట్ల రూపాయలు వైసీపీ నేతలు, కార్యకర్తల జేబుల్లోకి వెళ్లాయని తెలిపారు.చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం అభి వృద్ధి లక్ష్యంగా..పేదలకు మేలు చేయాలనే అందరికీ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రతి పేదవానికి నివేశన స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు.

# కనిగిరి సమస్యలపై అసెంబ్లీలో ఉగ్ర గళం

కనిగిరి, మేజర్‌న్యూస్: నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై ఎమ్యెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో గళమెత్తారు. నియోజకవర్గంలో హౌస్ కనెక్షన్స్ 1 లక్ష వరకు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్స్ 35 వేలు వరకు ఉన్నాయన్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఎంతో కాలంగా 329 మంది రైతులు వ్యవసాయ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని ప్రకాశం జిల్లాలో సుమారు 4000 మంది రైతుల కనెక్షన్లు ఉన్నాయని వీరంతా వ్యవసాయ విద్యుత్ కనేనెక్షన్ కొరకు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇక్కడ నీటి సమస్య ఎక్కువ..వర్షాభావ పరిస్థితులు ఎక్కువ...దీంతో రైతులు బోర్లుపైనే ఆధారపడి ఉన్నారని విద్యుత్ కనెక్షన్ కోసం నగదు చెల్లించినా అధికారులు కనెక్షన్లు ఇవ్వడం లేదన్నారు. రైతులకు వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడం లేదు కానీ అక్రమ వెంచర్లుకు మాత్రం విద్యుత్ కనెక్షన్లు



ఇస్తున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల పొలాల్లో ట్రాన్స్ఫార్మర్స్ కాపర్ తీగ దొంగతనాలు జరిగితే పోలీసు కేసుల నిర్లక్ష్యం వలన కూడా ట్రాన్స్ఫార్మర్స్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమస్యపై చొరవ చూపాలని కోరారు.ప్రకాశం జిల్లా వెనుకబడిన క్షామ పీడిత ప్రాంతం... త్రాగు నీరు, సాగు నీటి సమస్య ఎక్కువ అని తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ ఎక్కువ. ఇక్కడ ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు, రాయితీ ఇవ్వాలని కోరారు.

# వెలుగొండ ప్రాజెక్టుకు తక్షణమే నిధులు కేటాయించాలి

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: వెలుగొండ ప్రాజెక్టుకు 2025-26 సంవత్సరానికి రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్లో కేవలం 309 కోట్ల 15 లక్షలు కేటాయించారని, తక్షణమే 2000 కోట్లు బడ్జెట్లో సవరించి వెలుగొండ ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని సోమవారం వెలిగండ్ల బస్టాండ్ సెంటర్లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేయడం జరిగినది. ఈ నిరసనలో సిపిఎం పార్టీ నాయకులు రాయల మాలకొండయ్య పాల్గొని మాట్లాడుతూ మంత్రి వర్గ బృందం సందర్శించి 2027కి మొదటి స్వరంగం ద్వారా నీటిని విడుదల చేస్తామని చెప్పి కేవలం 309 కోట్ల 15 లక్షలు కేటాయించారని, ఆ కేటాయింపు కంటి తుడుపుకు చాలా వని, ఇప్పటికే వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి 30 సంవత్సరాలు అవుతున్న మూడో సారి ముఖ్యమంత్రిగా వచ్చినావెలుగొండ ప్రాజెక్టు పూర్తి అవుతుందని నమ్మకం లేకుండా పోతుందని ఆ నమ్మకం నిలబెట్టుకోవాలంటే వెలుగొండ ప్రాజెక్టు పరిధి లో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు తక్షణమే ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి ప్రాజెక్టు పరిధిలో ఉన్న రైతులకు ,ప్రజలకు తోడ్పాటు అందించాలని వారన్నారు. లేకపోతే దశ



లవారీగా వెలుగొండ ప్రాజెక్టు మీద అనేక పోరాటాలు చేయవలసి వస్తుందని వారు తెలిపారు. వెలిగండ్ల మండలంలో దాదాపు 17,600 ఎకరాలు పారుదలకు సిద్ధంగా ఉందని, ఎనిమిది ఇరిగేషన్ ఆయకట్టు చెరువుల కింద ఇంకో నాలుగు వేల ఎకరా లు ఉందని, ఎన్ని ఉన్న వర్షం కోసం ఎదురుచూసి పంటలు వేస్తున్న, అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బంది పడుతున్నారని, రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే వెలుగొండ ప్రాజెక్టు ఒక్కటే మార్గమని వారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు చెన్నయ్య, బాబు, షరీఫ్, చెన్నారెడ్డి, లాజరు, రాజయ్య, సిగినం తిరుపతయ్య పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు వద్దు

తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామంలో అంగన్వాడీ టీచర్స్ బాల్య వివాహలపై ర్యాలీ నిర్వహించారు. బాల్యంలో బాలికలకు వివాహం చేస్తే పెళ్లైన తర్వాత, ఒక అమ్మాయి ప్రపంచం నాటకీయంగా ఇరుకుగా మారుతుంది. బాల్య వధువులు వారి కుటుంబం, స్నేహితులు మరియు సమాజాల నుండి ఒంటరిగా ఉంటారు, అలాగేహింస, దుర్వినియోగం మరియు దోపిడీ. చిన్న వయస్సులోనే వివాహం చేసుకునే అమ్మాయిలు తరచుగా పిల్లలుగా ఉన్నప్పుడు గర్భవతి అవుతారు, వారి స్వంత శ్రేయస్సు, వారి పిల్లల శ్రేయస్సుకు చాలా ప్రమాదాలు ఉంటాయి. బాల్య వివాహాలకు, బడి మానేసిన వ్యక్తి, 18 ఏళ్లలోపు వివాహం చేసుకున్న బాలికలు తమ తోటివారి కంటే పాఠశాలకు వెళ్లే అవకాశం తక్కువగా ఉంటుంది



మరియు పాఠశాల మానేసిన బాలికలు వివాహం చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని బాల్యంలో పిల్లలను బడికి, కళాశాలకు పంపివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ శ్రీధర పద్మావతి, లలిత, సత్యనారాయణమ్మ, గాలి శివ అచ్చమ్మ, నాంచారమ్మా, మహిళలు పాల్గొన్నారు.






# బాలికల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత

### ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు

### నగరంలో క్యాండిల్ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు, మేజర్‌న్యూస్ : బాలికలు స్వేచ్ఛగా ఎదిగేలా వారి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా సోమవారం ఒంగోలులోని ప్రభుత్వ ఆసుపత్రి (రిమ్స్) నుంచి నెల్లూరు బస్టాండు సెంటర్ వరకూ నిర్వహించిన క్యాండిల్ ర్యాలీని ఆమె ప్రారంభించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మహిళలు, నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు సుమారు 1000మంది వరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వారోత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఒక ఇతివృత్తంతో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే 'బాల్యవివాహాల రహిత ప్రకాశం జిల్లా' ఆవిష్కరణ కోసం ప్రజలలో చైతన్యం కలిగించేలా ఈ క్యాండిల్ ర్యాలీని చేపట్టినట్లు తెలిపారు. కనీసం 18 ఏళ్ల నిండే వరకూ ఆడపిల్లలకు వివాహం చేయకుండా వారిని చదివించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ సూచించారు. బాల్యవివాహం చేసుకోబోనని ప్రతి ఆడపిల్ల కూడా సంకల్పం తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. బాలికల ఆరోగ్యం, హక్కులను కాపాడేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనా సుజన్, పలువురు సి.డి.పి.ఓలు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

# టిడిపి పాలనలోనే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు

### నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో 13 డి.ఎస్.సిలను నిర్వహించి 1,80,272 టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత టిడిపికే దక్కుతుందని దర్శి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. గత ఐదేళ్ళు వైసిపి నిరుద్యోగులను గాలికి వదిలేసింది కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలల కాలంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా చక చక అడుగులు వేస్తుందని, అందులో భాగంగానే అసెంబ్లీలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు మెగా డీఎస్సీ త్వరలో ప్రకటిస్తామని చేసిన ప్రకటన. నిరుద్యోగ యువతకు ఊపిరి పోసిందని డాక్టర్ లక్ష్మి అన్నారు. నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ని త్వరలో ప్రకటిస్తానని ఆయన హామీ ఇవ్వడం మనకు స్ఫూర్తిదాయకం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఒక్కొక్క హామీని అమలు చేస్తూ ముందుకు వెళుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నానని ఆమె అన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 16,347 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని విద్య ఐటీ శాఖ నారా లోకేష్ ప్రకటించారని తెలిపారు. ఈ సందర్భంగా యువత తరపున దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాలల్లో కూడా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు నారా లోకేష్ ప్రకటించారు. అదేవిధంగా ఆనాడు వైసిపి ప్రభుత్వం నాడు నేడు పేరుతో చేసిన అక్రమాలపై కూడా విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఇలా విద్యాభివృద్ధికి లోకేష్ చేస్తున్న కృషిని డాక్టర్ లక్ష్మీ కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళ వలె ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణానికి విద్య, వైద్యం ఉపాధి అవకాశాలు పెంపొందించి అభివృద్ధి ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే లక్ష్యంతో మన కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుంది. ఇదే స్ఫూర్తితో మన దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మార్చుకుందాం మన కూటమి ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేసే మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ పనులను అన్ని పూర్తి చేసుకునేందుకు మీ అందరి సహకారాన్ని కోరుకుంటున్నానని డాక్టర్ లక్ష్మి తెలిపారు.

## మసీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి

### ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



కనిగిరి, మేజర్‌న్యూస్: పవిత్ర రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని కనిగిరి నియోజకవర్గంలోని మసీదులు, పవిత్ర ప్రార్థనా స్థలాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముస్లిం పెద్దలు, ఇమామ్ మౌజన్ల తో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సూచనల మేరకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు .రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు ప్రతి రోజు ప్రార్ధనలు చేస్తారని మసీదుల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని, మంచినీటి సౌకర్యంతోపాటు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. మసీదుల వద్ద పారిశుద్ధ్య నిర్వాహణతోపాటు మసీదులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. మసీదుల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముస్లింలు ఉపవాసాల దృష్ట్యా హొటళ్ళు, రెస్టారెంట్లు, పాల కేంద్రాలు, హలీమ్ సెంటర్లు రాత్రి 12 గంటల వరకు తెల్లవారు జామున 3గంటల నుండి తెరిచిఉంచే విధంగా చర్యలుతీసుకోవాలని సూచించారు.

## బాలికలు తప్పనిసరిగా స్వీయ రక్షణ కలిగి ఉండాలి:ఎస్ఐ

యర్రగొండపాలెం, మేజర్‌న్యూస్: మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా సోమవారం యర్రగొండపాలెం ఎస్సై పి చౌడయ్య స్థానికంగా ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థినులకు ఎస్ఏ రైటింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్స్ పై తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు తప్పనిసరిగా స్వీయ రక్షణ కలిగి ఉండాలని, ఎదుటివారి నుండి తమను తాము రక్షించుకోవడం నేర్చుకోవాలని తెలిపారు. స్వీయ రక్షణ నైపుణ్యాలు, దృఢంగా మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. అదేవిధంగా సైబర్ భద్రత నియమాలు గురించి ప్రస్తుతం మనం టెక్నాలజీ యుగంలో ఉన్నామని, స్మార్ట్ మొబైల్స్ ఎక్కువగా వాడవద్దని చెప్పారు. మొబైల్ ఫోన్స్ ఎక్కువగా వాడటం వలన సైబర్ క్రైమ్ లాంటి నేరాలు జరగడానికి అవకాశం ఉందని తెలిపారు. ఆనాధరైస్డ్ యాప్స్, మొబైల్స్‌లో వచ్చే లింకులు సెలెక్ట్ చేయవద్దని తెలిపారు.మహిళలు, చిన్నారులకు



అత్యవసర సమయంలో సహాయం కొరకు హెల్ప్ లైన్ నెంబర్లు చైల్డ్ హెల్ప్ లైన్1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181, పోలీస్ హెల్ప్ లైన్ 100, 112,సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ తిరుమలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి బాలయోగి: గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మేజర్‌న్యూస్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి, పేదల ఆశా జ్యోతి జి.యం.సి బాల యోగి అని దర్శి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దేశంలోనే అత్యున్నతమైన లోక్‌సభ తొలిదళిత స్పీకర్‌గా సేవలందించి దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన కోనసీమ ముద్దుబిడ్డ, టీడీపీ నేత స్వర్గీయ జిఎంసీ బాలయోగి వర్ధంతి సందర్భంగా డాక్టర్ లక్ష్మినివాళ్ళు అర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన మహోన్నత వ్యక్తి బాలయోగి అని సామాన్య కుటుంబంలో జన్మించి అత్యున్నతమైన లోక్ సభ స్పీకర్‌గా ఎదిగిన బాలయోగి జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్రానికి, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ బాలయోగి ఆశయసాధనకు ప్రతిఒక్కరం పునరంకితమవుదామని డాక్టర్ లక్ష్మి కోరారు.

## బాలల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలి:ఎంపీడీవో

పొదిలి, మేజర్ న్యూస్: బాలల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న వారోత్సవ కార్యక్రమంలో మూడో రోజు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రతిజ్ఞ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల బంగారు భవిష్యత్తు కోసం బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాలని, అందుకోసం ప్రతి



ఒక్కరి కృషి ఎంతో అవసరమని అన్నారు. ఎంఈఓ ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి బాలిక చదువుకునే విధంగా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ముందుగా కొండాయపాలెం సచివాలయం మూగచింతల పంచాయతీ పరిధిలో ఎంపీయుపి స్కూల్ ఆవరణలో బాల్య వివాహ చట్టం నిర్మూలన అమలు సిగ్నేచర్ కాంపెయిన్, ప్రతిజ్ఞ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రాజెక్టు ఆఫీసర్ పి.సుధామారుతి మాట్లాడుతూ బాలబాలికలకు బాల్య వివాహ నిషేధ చట్టం-2006 ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమాలలో యుటిఎఫ్ పొదిలి మండల కార్యదర్శి పాలడుగు వెంకటేశ్వర్లు పొదిలి మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, అంగన్వాడీలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రోన్ కెమెరాతో పర్యవేక్షణ

చీమకుర్తి, మేజర్‌న్యూస్: పట్టణంలోని నాయుడు పాలెంరోడ్‌లోని కళ్ళు కొట్టు బజారు, మర్రి చెట్లపాలెం గ్రామంలో డ్రోన్ కెమెరాను చీమకుర్తి సిఐ ఎం సుబ్బారావు ఉపయోగించి. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా డ్రోన్ కెమెరా ద్వారా పర్యవేక్షించడం జరిగింది.



## ఘనంగా బిజెపి అధికార ప్రతినిధి విజయలక్ష్మి జన్మదిన వేడుకలు

పొదిలి, మేజర్‌న్యూస్:బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి జన్మదిన వేడుకలు ఆదివారం బెల్లంకొండనగర్‌లోని ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు పాల్గొని విజయలక్ష్మికి పుట్టినరోజు సందర్భంగా



జన్మదిన కేకును కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి: కదిరి పార్థసారథి



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ఇంటర్మీడియట్, పదవతరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు బాగా వ్రాసి మంచి ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించాలని కదిరి బాబురావు విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారథి అన్నారు. సోమవారం మండలంలోని కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ప్లస్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులను కలిశారు. ఈ సందర్భంగా ఇప్పుడు జరుగుతున్న పరీక్షలలో ఎటువంటి భయాందోళనకు గురికాకుండా పరీక్షలు వ్రాసి మంచి ఫలితాలు సాధించాలని ప్లస్ కళాశాలకు అధ్యాపకులకు తల్లిదండ్రులకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పదవతరగతి విద్యార్థులను కలిసి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కదిరిపార్థసారథి, ప్రధానోపాధ్యాయుడు ఎన్.తిరపతయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన చిట్యాల విజయభాస్కర్ రెడ్డి



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని హాజీపురం, దాసర్లపల్లిలో ప్రముఖ పారిశ్రామిక వేత్త చిట్యాల వెలుగొండ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చిట్యాల సుధాకర్ రెడ్డి, చిట్యాల విజయభాస్కర్ రెడ్డి పలు ఆర్థిక సహాయాలు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో హాజీపురం ఎస్సీ కాలనీలో దారా జకరయ్య కుటుంబాన్ని పరామర్శించి 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయటం జరిగింది. అనంతరం దాసర్లపల్లి ఎస్సీ కాలనీలో బొజ్జ ప్రకాశం కుటుంబాన్ని పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ పార్టీ నాయకులు భవనం కృష్ణారెడ్డి, సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, గురు ప్రసాద్ గాయం సుధాకర్ రెడ్డి రావి తిరుపతిరెడ్డి, నాగార్జున రెడ్డి, ఎంపీటీసీ నారాయణస్వామి రాజు, సర్పంచ్ చిన్న, వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచ్ లింగేశ్వరరావు, ఆవులు మల్లయ్య, దేవి రెడ్డి ప్రసాద్ రెడ్డి, వెంకటస్వామి రెడ్డి, వెంకటేశు, రాజారావు, సుందరు, జగదభి, కొండం రాజు, కోటపాటి మోహన్ రెడ్డి, కాటమరాజు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్ సస్పెండ్‌ను వ్యతిరేకిస్తూ నిరసన




కనిగిరి, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్‌లో సీనియర్ ఐపీఎస్ అధికారి పివి సునీల్ కుమార్‌ను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాలల ఐక్యవేదిక నాయకులు శాంతి కుమార్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా సమన్వయకర్త దమ్ము కేశవులు మాట్లాడుతూ అణగారిన వర్గాల నుంచి సీనియర్ ఐపిఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌ను ప్రభుత్వ సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా సస్పెండ్ చేయడం సరికాదని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మురారి వెంకటేశ్వర్లు, ఎస్సీ వర్గీకరణ నియోజకవర్గ అధ్యక్షులు కోటికల బాదుర్లు, ధర్మేంద్ర, దళిత హక్కుల పోరాట సమితి పందిటి మోహన్, ఏరువారిపల్లి సర్పంచ్ దమ్ము వెంకటయ్య, పలుకూరి భాస్కర్, దమ్ము వెంకటేష్, అనిల్, వెంకటేశ్వర్లు, నాయబ్, జనమాల విశ్వనాథ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహమదాపురంలో పదవ తరగతి వీడ్కోలు సభ



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని మహమ్మదాపురం మహమ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఘనంగా పదవ తరగతి వీడ్కోలు సభ, వార్షికోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరులోని పీపుల్స్ న్యూరో ట్రామ హాస్పిటల్ డాక్టర్ కేసరి వెంకటేశ్వర రెడ్డి పాల్గొనడం జరిగింది. గత సంవత్సరం 10వ తరగతి పరీక్షలలో హనుమంతునిపాడు మండల స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన కుమారి బ్లెస్సికి రూ.50వేలు, రెండవ బహుమతి సాధించిన యస్ నరసింహారెడ్డికి రూ.30వేలు, మూడో బహుమతి సాధించిన కుమారి నాళి ప్రశాంతికి రూ.20వేలు, శ్రీ కేసరి వెంకటేశ్వర్ రెడ్డి వారి తల్లిదండ్రులు అందించడం జరిగింది. ప్రతి సంవత్సరం హనుమంతునిపాడు మండలంలో పదవ తరగతిలో ప్రతిభ సాధించిన అందరికీ రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు బహుమతులు అందిస్తానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏతం శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా హనుమంతునిపాడు ఎంఈఓ గుర్రం పెద్ది రాజు, రెండవ ఎంఈఓ రమణయ్య, వెలిగండ్ల ఎంఈఓ రామిరెడ్డి, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొండయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొనడం జరిగింది. చివరిగా విద్యార్థిని విద్యార్థులు చేసిన వివిధ నృత్యరూపకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# మున్సిపల్ కార్మికుల ఛలో విజయవాడను జయప్రదం చేయండి



మార్కాపురం, మేజర్‌న్యూస్: ఏపీ మున్సిపల్ వర్కర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డీకేయం రఫీ మాట్లాడుతూప్రైవేట్ ఏజెన్సీలకు మున్సిపల్ కార్మికులను అప్పజెప్పే విధానాలు మానుకోవాలని, మున్సిపల్ కార్మికుల సమస్యలు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని గత సమ్మె కాలం జరిగిన ఒప్పందాలకు జీవోలు వెంటనే ఇవ్వాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను మున్సిపల్ కార్మికులకు వర్తింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం వస్తే మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని చెప్పినవారు ఉన్న కొద్దిపాటి ఉద్యోగ భద్రతను ఆప్కాస్ ను రద్దు చేస్తామని చెప్పటాన్ని ఆయన ఖండించారు. మున్సిపల్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి తెలియజేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5న ఛలో విజయవాడ మహా ధర్నా జరుగుతున్నదని మహా ధర్నాకు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కే.సుబ్బరాయుడు, జి.హరి, సలాం ఖాన్, ఎస్కే ఇమాంసా, యూసఫ్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా జిల్లా అనుబంధ విభాగ సభ్యులకు సన్మానం



పెద్దారవీడు, మేజర్‌న్యూస్: వైసిపి పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ఆశీస్సులతో యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన జిల్లా అధికార ప్రతినిధి ఏలూరు వెంకట నారాయణరెడ్డి, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు వెన్నా శివ కృష్ణారెడ్డి, దివ్యాంగుల నియోజకవర్గం అధ్యక్షులుగా గుర్రం ముత్యాలయ్య యాదవ్ నియమించిన సందర్భంగా అందరికీ శాలువా, పూల దండలతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ నాయకులు పెద్దారవీడు వైస్ ఎంపీపీ గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు తోకల ఆవులయ్య యాదవ్, ఏరువ శేష సేనారెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పాలగిరి వెంకట రామాంజిరెడ్డి, సర్పంచ్ గుడ్డెపొగు రమేష్, గుమ్మా అంకయ్య, చలిబిండి నారాయణరెడ్డి, తోకల సత్యనారాయణ, మారంరెడ్డి శివారెడ్డి, పొడతూరపు గంగులీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# స్పందన విద్యాసంస్థలలో ఘనంగా సైన్స్ డే సంబరాలు



రాచర్ల, మేజర్‌న్యూస్: మండల కేంద్రంలోని స్పందన విద్యాసంస్థలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా తయారు చేసిన 35కు పైగా ప్రాజెక్టులు ప్రదర్శనకు ఉంచి, విద్యార్థులచే వివరించడం జరిగినది. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పాఠాలు చెప్పించే పోటీలలో 650 మందికి పైగా విద్యార్థులు వారి వారి తల్లితండ్రులతో పాటు పాల్గొన్నారు. ప్రతీ విద్యార్థి ఎలాంటి భయం, బెరుకులేకుండా అద్భుత బోధన చేసి వారి తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల మెప్పు పొందారు. అత్యుత్తమంగా పాఠాలు చెప్పిన 250 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం మెమెంటోలు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు మాట్లాడుతూ ఇంత చిన్న వయస్సులో తమ పిల్లలు పాఠాలు చెప్పడం ఒక మరిచిపోలేని అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పందన విద్యాసంస్థల విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది, యాజమాన్యం పాల్గొన్నారు.

# శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదాయం రూ.1,59,450లు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.1,59,450లు వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. ఈసందర్భంగా పూజాటికెట్లు ద్వారా రూ.48,830లు, లడ్డుప్రసాదాలు అమ్మకం ద్వారా రూ.22,760లు, శాశ్వత అన్నదాన పథకానికి రూ.82,044లు, పంచామృత అభిషేకం పూజలకు రూ.5,516లు వచ్చినట్లు శాశ్వత అన్నదాన పథకానికి పామూరు పట్టణానికి చెందిన గూడూరు వాస్తవ్యులు మంచికంటి పుల్లయ్య, విజయలక్ష్మి దంపతులు రూ.44,116లు దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు మంచికంటి మధుసూదనరావు చేతులమీదుగా దేవస్థానంనకు అందజేసినట్లు ఇఓ తెలిపారు. ఈ సందర్భంగా దాతలను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, దాతలు మంచికంటి మధుసూదనరావు కుటుంబ సభ్యులు, నల్లమడుగుల ఎంపిటిసి ముడుమాల ఆర్.నారాయణరెడ్డి, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన ఆవిర్భావ సభకు ఇమ్మడి కాశీనాథ్



మార్కాపురం, మేజర్‌న్యూస్: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 14వ తేదీన పిఠాపురంలో నిర్వహించే ఆవిర్భావ సభకు అనకాపల్లి నియోజకవర్గ సమన్వయ కర్తగా జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్‌ని నియమించడం జరిగింది.

## సిద్ది బైరవేశ్వర స్వామి దేవస్థానంలో అన్నా దంపతులు పూజలు



రాచర్ల, మేజర్‌న్యూస్: మండలంలోని రామా పురం గ్రామంలో సుప్రసిద్ద దేవాలయం సిద్ది బైరవేశ్వర స్వామి దేవస్థానం లో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, దుర్గాకు మారి దంపతులు మహాశివ రాత్రి పర్వదినం అనంతరం వచ్చిన మొదటి సోమవారం 'ప్రత్యేక పూజలు' నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు శైవాగమ నియమానుసారం అభిషేకాది పూజలు వారిచేత చేయించారు.

## కేజీబీవీలో వ్యాసరచన పోటీలు



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీ పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు హనుమంతునిపాడు ఎస్సై కె.మాధవరావు ఆధ్వర్యంలో మహా జయహో మహిళ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకమైన వ్యాసరచన పోటీలు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీలు, విద్యార్థినీలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీలకు నూతన ట్రాక్టర్లు పంపిణీ

తాళ్లూరు, మేజర్‌న్యూస్: మండల పరిషత్ కార్యాలయం నందు స్వచ్ఛ భారత్ మిషన్ స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛత దివస్ స్వచ్ఛత దినోత్సవం 'చేయి చేయి కలుపుదాం-స్వచ్ఛ ఆంధ్రను సాధిద్దాం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివరాంపురం, నాగంబొట్లపాలెం, లక్కవరం, బొద్దికూరపాడు గ్రామాలకుచెత్త ఎత్తివేసే ట్రాక్టర్లు పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కడియాల లలిత్ సాగర్ పాల్గొంటున్నారు. కావున మండలంలోని కూటమి సభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాము అని పార్టీ అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి తెలిపారు.

## శివలింగాన్ని తాకిన సూర్య కిరణాలు



చీమకుర్తి, మేజర్ న్యూస్: పట్టణంలోని ఇసుక వాగు సెంటర్ లోని శ్రీ గంగా పర్వత వర్ధిని దేవి సమేత శ్రీసాక్షి రామ లింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి తరువాత శివాలయంలో ఉన్న శివలింగాన్ని సూర్య కిరణాలు తాకాయి. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా శివరాత్రి తరువాత సూర్యకిరణాలు శివలింగంపై ప్రసరిం చాయి. ఈఅద్భుతాన్ని చూడడా నికి భక్తులు ఆలయానికి భారీగా తరలివచ్చారు. సూర్యకిరణాలు శివలింగంపై పడుతున్న సమయంలో స్వామివారిని దర్శించుకుంటే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని, ఆరోగ్యం మెరుగుపడు తుందని, అష్టైశ్వర్యాలు కలుగుతాయని ఆలయ అర్చకులు ఎస్ కోటేశ్వరశర్మ, రాఘవేంద్రశర్మలు తెలి పారు.శివనామస్మరణతో శివాలయం మారుమ్రోగింది.

## పేకాటరాయుళ్లు అరెస్టు



కొండేపి, మేజర్న్యూస్: మండలంలోని పెరిదేపి గ్రామం పోలాలో తువ్వన పెకాడుతున్న వ్యక్తులను సోమవారం సాయంత్రం కొండపి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.సోమశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై బి. ప్రేమ్ కుమార్ తమ సిబ్బందితో కలసి పెరిదేపి పొలాలలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రూ.16,170లను నగదు స్వాధీనపరుచుకొని వారిని కోర్టులో హాజరుపరచినట్లు తెలియజేశారు.

## ప్రమాదవశాత్తు కణితి మృతి



సి.ఎస్.పురం, మేజర్న్యూస్: ప్రమాదవశాత్తు కొండపై నుండి నీటి జలపాతంలో పడి అడవి జంతువు కణితి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని పర్యాటక శైవక్షేత్రమైన భైరవకోనలో జరిగినది. వివరాలకు భైరవకోన కొండలపై నుండి కణితి జలపాతంలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందిన విషయం తెలుసుకున్న అంబవరం సెక్షన్ అటవీ సిబ్బంది వెంటనే కనిగిరి అటవీ రేంజి అధికారి ఉమామహేశ్వరరెడ్డికి సమాచారం తెలుపగా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు స్థానిక అటవీ అధికా రులు పశుసంవర్ధకశాఖ అధికారులకు తెలియ జేయగా మండల పశువైద్యాధికారి డాక్టర్ షేక్ మునీర్ ఆధ్వర్యంలో మరణించిన కణితికి పంచనామా నిర్వహించగా అనంతరం అటవీ సిబ్బంది కణితిని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది, పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

కొండేపి, మేజర్న్యూస్: మండలంలోని నేతివారిపాలెం గ్రామానికి చెందిన వల్లపు జ్యోతి(19) తండ్రి మాల కొండయ్య అను ఆమె తన తల్లి సుమారు 2 నెలల క్రితం చనిపోగా మనస్తాపం చెంది, జ్యోతి అప్పటి నుండి ఎవరితో మాట్లాడకుండా ఇంటి వద్దనే ఉంటు సోమవారం మధ్యాహ్నం సమయంలో తన ఇంట్లో ఉరి వేసుకొని చనిపోగా స్థానిక ఎస్సై బి.ప్రేమ్ కుమార్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

# బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

### 'మీకోసం'లో ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులకు ఆదేశం



ఒంగోలు, మేజర్న్యూస్: ప్రజా పిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం అందేలా చేయాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశిం చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసంకు 78 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రజలు నుండి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. నడవలేని పరిస్థితిలో వచ్చిన ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అందిన ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, చీటింగ్, జాబ్ ఫ్రాడ్, భూ వివాదాలు, ఇతర సమస్యల గురించి ప్రజా పిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సీఐ యన్. శ్రీకాంత్ బాబు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్, సిసిఎస్ సీఐ జగదీష్, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియా సుల్తాన్, ప్రభాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## 10న ఛలో విజయవాడ జయప్రదం చేయండి



వెలిగండ్ల, మేజర్న్యూస్: అంగన్వాడి వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెం టర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరుతూ సోమవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు వెలిగండ్ల కార్యాలయంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ముక్కు మహాలక్ష్మమ్మ హాజరై మాట్లాడుతూ సమ్మె సందర్భంగా అంగన్వాడీలకు 2024 జూలైలో వేతనాలు పెంచుతాము, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని మినిట్స్ ఇచ్చారు. కానీ ఇప్పుడున్నటువంటి ప్రభుత్వం అంగన్వాడీలకు మేము వస్తే న్యాయం చేస్తామని అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నేటికీ ఆ సమస్యలు అలాగే మిగిలిపోయాయి. ప్రభుత్వం పునరాలోచించి మినిట్స్ కాపీలో ఉన్న అంశాల మీద అధ్యయనం చేసి బడ్జెట్లో మా యొక్క సమస్యలు పరిష్క రిస్తారని వారన్నారు. ఈ నెల 10న చలో విజయవాడ కార్యక్రమాన్ని మూడు సంఘాల ఆధ్వర్యంలో జయప్రదం చేసి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్స్తో కూడిన వినతి పత్రం సూపర్వైజర్ వై కమల కుమారి, సీనియర్ సహాయ కులు కే చాందినికి మహా ధర్నా చేస్తున్నామని ముందు గా నోటీస్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గౌస్ బేగం, వెంకటలక్ష్మి, మాధవి, సలోమి, ప్రమీల, సౌభాగ్యం, కుమారి, మమత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ శిక్షణ తరగతులు : మిరియం

ఉలవపాడు, మేజర్న్యూస్: ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడలో భారత చైతన్య యువజన పార్టీ యువజన విభాగం శిక్షణ తరగతులు, నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందని భారత చైతన్య యువజన పార్టీ మాజీ రాష్ట్ర సమన్వయ సారథి మిరి యం శ్రీనివాసులు సోమవారం తెలిపారు. విజయ వాడలోని ఎన్టీఆర్ కాలనీ బీ.సీ.వై పార్టీకి అనుబంధంగా యువత రాజకీయాల్లో ముఖ్యమైన పాత్ర పోషించాలని ఉద్దేశంతో జాతీయ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ యువదళం పేరుతో యువజన విభాగ కమిటీ ఏర్పాటు చేస్తూ యువతకు పార్టీలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్దేశంతో రాజకీయ శిక్షణతో పాటు నూతన కమిటీ ఎన్నిక చేసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఎండ గడుతో ప్రజా ఉద్యమాలు చేయాలని ఉద్దేశంతో రామచంద్ర యాదవ్ యువజన విభాగానికి సమర్థులైన యువతకు బాధ్యతలు అప్పగిస్తున్న సందర్భంగా రాష్ట్రంలోని రాజకీయాల పట్ల ఆసక్తి కలిగిన యువత పాల్గొని కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## శ్రీ చైతన్యలో ఘనంగా సైన్స్ ఫెయిర్



టంగుటూరు, మేజర్న్యూస్: మండలంలోని శ్రీ చైతన్య హైస్కూల్లో ఘనంగా సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు రకరకాల వైజ్ఞానిక ప్రదర్శనను చేసి ప్రదర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ వి.వి.రమణ, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.వెంకాయమ్మ, డైరెక్టర్ వివి రాజసింహ, పత్తిపాటి బ్రహ్మానందం మొదలగు వారు పాల్గొని విద్యార్థుల ద్వారా ప్రదర్శించబడిన అన్ని వైజ్ఞానిక విషయాలను స్వయంగా అడిగి తెలుసుకు న్నారు. ప్రతి తరగతిలోని విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించి వారి ద్వారా ప్రాజెక్టులను చేయించిన సైన్స్ ఉపాధ్యాయులైన పుణ్యహర్ష, షేక్ చిన్న సాహెబ్, సుమతి, వాసవి ప్రియాంకలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సైన్స్ ఫెయిర్ని తిలకించారు.

## దశదినకర్మలో కదిరి పార్థసారథి

సి.ఎస్.పురం, మేజర్న్యూస్: మండలంలోని ఆనికాళ్ళపల్లె గ్రామంలో కామిరెడ్డి చినవెంకటరెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో మండలంలోని కదిరి బాబురావు విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు కె.భాస్కరరెడ్డిని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో కదిరి పార్థసారథి, మునగల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.



## వివాహ వేడుకలో డాక్టర్ కడియాల లలిత్ సాగర్

దర్శి, మేజర్న్యూస్: పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వడ్డమాని శ్రీనివాస శాస్త్రి, వెంకట నాగ భారతి కుమారుని వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ హాజరయ్యారు. వధువారులు సత్య భరద్వాజశర్మ, లలిత ఆశీర్వదించి, వివాహశుభా కాంక్షలను టిడిపి యువనాయకులు డాక్టర్ కడి యాల లలిత్ సాగర్ తెలియచేశారు. డాక్టర్ సాగర్తో పాటు టిడిపి సీనియర్ నాయకులు కలువకొలను చంద్రశేఖర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దారం సుబ్బారావు, సుంకర రాఘవరెడ్డి రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### ఎంపీడీఓ, తహసీల్దార్



చీమకుర్తి, మేజర్న్యూస్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో కే రాఘవేంద్ర, తహసిల్దార్ బ్రహ్మయ్య పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాలు, సంతకాల సేకరణ, బాల్య వివాహాల గురించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో కే.రాఘవేంద్ర మాట్లాడుతూ నేడు మహిళలు మగవాళ్ళతో సమానంగా పోటీ పడుతూ చదువు ఉద్యోగాలలో రాణిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వై జర్లు కె ప్రమీల, ఆర్ పిచ్చమ్మ, అంగన్వాడి వర్కర్లు, మదర్స్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ

సి.ఎస్.పురం, మేజర్న్యూస్: తెలుగుదేశం అధిష్టానం ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయవంతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యులుగా సభ్య త్వం పొందినవారికి కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలమేరకు మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ బొమ్మనబోయిన వెంగయ్య, ప్రధానకార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు సూచనలతో సోమవారం మండలంలోని బోయమడుగుల పంచాయతీ వెంకటాయచెరువు గ్రామంలో యూనిట్ ఇంచార్జి కోనంగి వెంకటకొండయ్య పలువురికి సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి సభ్యత్వం కార్యకర్తలకు అన్నివిధాలా భరోసా కల్పిస్తున్నట్లు పలువురు టిడిపి నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటకొండయ్య, ఆవుల మహాలక్ష్మయ్య, బి.మాలకొండయ్య, ఏ.వెంకట లక్ష్మయ్య, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# అప్కాస్ రద్దు ఆలోచన ఉపసంహరించుకోవాలి

## ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి డిమాండ్



ఒంగోలు, మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం అప్కాస్ విధానం రద్దుచేసి, ప్రయివేట్ కాంట్రాక్ట్ విధానం తేవాలని ప్రకటించడం ఉపసంహారంచుకోవాలని ఏపి మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు యస్.డి.సర్దార్ డిమాండ్ చేశారు. ఏపి మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈరోజు ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అప్కాస్ రద్దు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, కార్మికులని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పడం సరికాదని ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఒంగోలు నగరంలో పనిచేసిన మేస్త్రీలందరినీ విధుల్లోకి తీసుకోవాలని ఐదు నెలలైనా పాలకుల స్పందించలేదని, కార్మికులపై రాజకీయ జోక్యం ఆపాలని, కార్మికులందరినీ పర్మిట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీజిల్లా నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాసర్, ఆదినారాయణలు మీకోసంలో డిఆర్వోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిబాబు, కిరణ్, శేషయ్య, చెన్నయ్య, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, గోపి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి

## 'మీకోసం'లో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు, మేజర్‌న్యూస్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఆర్.గోపాలకృష్ణతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 'మీ కోసం' కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నందున ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితిల్లోనూ అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని చెప్పారు. సాంకేతిక సమస్యల వలన క్షేత్రస్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో బి.చినఓబులేసు, డిప్యూటి కలెక్టర్లు జాన్సన్, పార్థసారధి, వరకుమార్, విజయజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## కృష్ణాపురం దళితుల భూములు ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేయాలి: సుజన్ మాదిగ

కనిగిరి, మేజర్‌న్యూస్ : కనిగిరి మండలం కృష్ణాపురం గ్రామంలో, దళిత మాదిగ కులం మన్నేపల్లి విజయ్‌కుమార్‌కు చెందిన సర్వేనెంబర్ 46/1,2 లోని 3.05 వారి తాతల తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని, అదే గ్రామానికి చెందిన అగ్రకులాలు అక్రమించారని వారిపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద కేసు నమోదు చేయాలని, మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం కనిగిరి మండలం కృష్ణాపురంలోని దళితులకు చెందిన భూమిని, మండల సర్వే అధికారులతో పాటుగా మాదిగ సంక్షేమ పోరాట సమితి ప్రతినిధుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా సుజన్ మాదిగ మాట్లాడుతూ, దళితుల భూములకు రక్షణ కరువైందన్నారు. అటువంటి వారిపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, తక్షణమే వారిని అరెస్ట్ చేయాలని సుజన్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుజన్ మాదిగతో పాటుగా మాదిగ సంక్షేమ పోరాట సమితి ప్రతినిధులు గద్దె త్యాగరాజు, కొలకలూరి విజయ్‌కుమార్, తేళ్ల జయరాజ్, సురేష్, గంగవరపు శేఖర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల్లో ఏఎస్పీ విఠలేశ్వర్ పరిశీలన



చీరాల, మేజర్‌న్యూస్: చీరాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షా కేంద్రాలను అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ పరిశీలించారు. సందర్భంగా చీరాలలోని ఏకేపి, వీఆర్ఎస్ కళాశాలలో పరీక్ష కేంద్రాలకు సంబంధిచిన పోలీస్ బందోబస్తుపై ఆరా తీశారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పరీక్ష పూర్తయిన తరువాత సీల్ వేసిన సమాధాన పత్రాలను తగిన ఎస్కార్ట్‌తో సంబంధిత కార్యాలయాలకు చేర్చాలని ఆదేశించారు. ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

## బ్యాంకు రుణంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి



చీరాల, మేజర్ న్యూస్ : చీరాల బ్యాంకులు అందించే వివిధ రకాల రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య అన్నారు.చీరాల పద్మశాలి కళ్యాణ మండపంలో యూనియన్ బ్యాంక్ మేగా ఎంఎస్‌ఎంఈ క్యాంపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో స్వయం ఉపాధి రంగాలతో మహిళలు ఆర్థికంగా బలపడ్డారంటే దానికి ప్రధాన కారణం బ్యాంకుల అందిస్తున్న ప్రోత్సాహమేనని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అనంతరం వివిధ రంగాల ప్రజలకు 25 కోట్ల రూపాయల రుణ సదుపాయ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదగా అందజేశారు. యూనియన్ బ్యాంక్ వివిధ బ్రాంచీల ప్రతినిధులు, టిడిపి జనసేన బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## క్విజ్‌లో మెడికల్ కాలేజీ విద్యార్థినికి బహుమతి

ఒంగోలు, మేజర్‌న్యూస్: మంగళగిరి ఎయిమ్స్‌లో జరిగిన లివర్ పాథాలజీ క్విజ్ అంశంలో ఒంగోలు మెడికల్ కాలేజీ విద్యార్థులు మూడో బహుమతి అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ పోటీలో వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ రెండో సంవత్సరం విద్యార్థి ఆర్.దివ్య మూడో బహుమతి అందుకున్నారు. ఈ బహుమతి సాధించడం పట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు, ప్రొఫెసర్ హెచ్‌వోడి ప్యాథాలజి డాక్టర్ సుధాకర్ అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిస్తున్న విధానం అందరికీ స్ఫూర్తిదాయకమని ప్రొఫెసర్‌లు, సిబ్బంది అభినందించారు.

# వ్యవసాయ, ఉచిత విద్యుత్‌కు రూ.12,400 కోట్ల వ్యయం

**మొదటి పేజీ తరువాయి** ఉపకరణాల కొనుగోలు ధరల్లో మార్పులు లేకుండా స్థిరీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు.

### పగటి పూటే రైతులకు 9 గంటలు

పిఎం కుసుమ్ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రైతులకు పగటి పూట పూర్తి స్థాయి విద్యుత్ సరఫరాలో కొన్ని ఆటంకాలు ఏర్పడిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి సభలో ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం పిఎం కుసుమ్ పథకం ద్వారా అతి త్వరలోనే రైతులకు 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించే దిశగా అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు 4.50 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అవసరం అని అంచనా వేసిన మంత్రి ఇప్పటికే లక్ష పిఎం కుసుమ్ కనెక్షన్లకు మంజూరయ్యాయని తెలిపారు. మరో రెండు లక్షల కనెక్షన్లకు సంబంధించి కేంద్రం సానుకూలంగా స్పందించిందన్నారు. వీటికి సంబంధించి త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలు పెడుతున్నామని తెలిపారు.

### అల్యూమినియం ట్రాన్స్‌ఫార్మర్లతో దొంగతనాలకు అడ్డుకట్ట

రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని పేర్కొన్నారు. లోఓల్టేజ్‌తో పాటు అధిక లోడ్ సమస్యలను పరిష్కరించేందుకు మూడు డిస్కంల పరిధిలో త్వరలోనే 70 సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పల్నాడు, ప్రకాశం, బాపట్ల ప్రాంతాల్లో జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలను నిలువరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే రాగి వైరు కోసమే దొంగతనాలు జరుగుతున్నాయని, ఇకపై అల్యూమినియం వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాబోయే వ్యవసాయ సీజన్ సమయానికి రైతులకు విద్యుత్ శాఖ పరంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు.

# నిర్ణీత గడువులో సర్వేలు పూర్తి చేయాలి




**మొదటి పేజీ తరువాయి** అటెండెన్స్, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య ఏర్పాట్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, జాతీయ ఉపాధి అమలు, స్కూలు టాయిలెట్స్ ఇన్స్పెక్షన్, తదితర అంశాలపై మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో జరుగుచున్న ఎంఎస్‌ఎంఈ సర్వే, పి-4 సర్వేలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఎంఎస్‌ఎంఈ సర్వే ఈనెల 15లోగా సర్వే పూర్తి చేయాలని, అలాగే పి-4 సర్వే ఈ నెల 4 వ తేదీ లోపు పూర్తి చేయాలని, నిర్దేశించిన గడువులోపు సర్వేలను పూర్తిచేయకుండా అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారులు వేగంగా ఇళ్ళు నిర్మించుకునేందుకు చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్లను త్వరగా మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది అందరూ వంద శాతం బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరుపై ప్రతిరోజు మానిటరింగ్ చేయాలని కలెక్టర్, ఎంపిడిఓలు, మునిసిపల్ కమినర్లను ఆదేశించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి 90 రోజుల పని దినాలు లక్ష్యం మేరకు కల్పించాలని జిల్లా కలెక్టర్, ఎంపిడిఓలను ఆదేశించారు. జిల్లాలో ఉపాధి కింద జరుగుచున్న పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ, ఎంపిడిఓలు, ఏపిడీలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఉపాధి హామీ పనులను పర్యవేక్షించడంతో పాటు ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుచున్న అభివృద్ధి కార్యక్రమాలు పటిష్టంగా అమలు జరిగేలా ఎంపిడిఓ పూర్తి భాద్యత వహించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జడ్పి సిఈఓ చిరంజీవి, ఆర్.డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర రావు, హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖాదికారి శ్రీనివాస రావు, డిపిఓ వెంకటనాయుడు, డ్వామా పిడి జోసఫ్ కుమార్, సిపిఓ వేంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జెడి శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ జేడి బేబి రాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటేశ్వర రావు పాల్గొనగా, క్షేత్ర స్థాయి నుండి మునిసిపల్ కమీషనర్లు, డిఎల్.డి.ఓలు, ఎంపిడిఓలు, ఈఓ పిఆర్డిలు, ఎపిఓ తదితరులు పాల్గొన్నారు.